క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 : 30వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని కరెంట్ ఏఈ రామ్మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతు కారణంగా, ఈ అంతరాయం ఏర్పడునని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

16న వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో వైద్యం పొందుతున్న తలసేమియా, సికిల్‌సెల్ పిల్లలకు హైదరాబాద్‌లోని సీఎస్ సిటిజన్స్ ఆసుపత్రి హిమటాలజిస్ట్ వైద్యుడు రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిపుణులతో వైద్య శిబిరాన్ని జూన్ 16న నిర్వహిస్తున్నట్లు తలసేమియా సికిల్‌సెల్ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ తెలిపారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే వారు ఈ నెల 30వ తేదీ లోపు 70362 22259 నంబర్‌లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం



ప్రశంసా పత్రాలు ఇస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలో ఆదివారం ఇరిగేషన్ శాఖకు చెందిన ఏఈ వెంకటరమణ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పదిమంది వచ్చి రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది సంపత్, ముత్తయ్య, కృష్ణకుమార్, సంజీవ్, దేవయ్య, లింగయ్య, లక్ష్మణ్, రోషన్, బ్లడ్‌బ్యాంకు ఇంచార్జి మధుసూదన్ రెడ్డి, రెడ్‌క్రాస్ కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కె. మాధవి, సదానందం పాల్గొన్నారు.

'వివేక్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదం'



మాట్లాడుతున్న నాయకుడు పాడేటి రవి

భీమారం: గతంలో కన్నా ధాన్యం కొనుగోళ్లు ఎంతో సాఫీగా జరుగుతున్నాయని జిల్లా కాంగ్రెస్ నాయకులు పాడేటి రవి పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా, కావాలని బీఆర్ఎస్ నాయకులు సమస్యను సృష్టిస్తున్నారన్నారు. ప్రజలతో సంబంధం లేని వ్యక్తులు కూడా వివేక్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డితో పాటు నాయకులు కొత్త సత్తిరెడ్డి, కట్కూరి ప్రకాశ్ రెడ్డి, వేల్పుల శ్రీనివాస్ ఉన్నారు.

అసంపూర్తిగా అప్రోచ్‌రోడ్డు పనులు



కొనసాగుతున్న అప్రోచ్‌రోడ్డు పనులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల, కమ్మరిపల్లి, తుర్కపల్లి, దుబ్బపల్లి, గంగారం గ్రామాల ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం ఆ గ్రామాలకు వెళ్లేందుకు వాగుపై వంతెనను నిర్మించారు. కానీ వంతెన దాటాక అప్రోచ్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేదు. ప్రస్తుతం సుద్దాల వైపు మట్టితో రోడ్డు ఏర్పాటు చేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.4.82కోట్లు మంజూరయ్యాయి. అప్రోచ్‌రోడ్డు పనులను గత నెల రోజుల క్రితం ప్రారంభించారు. కానీ ఇప్పటికీ పనులు నెమ్మదిగానే కొనసాగుతున్నాయి. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానుంది, ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే వాగు ఉప్పొంగితే మళ్లీ రాకపోకలు బంద్ అవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ భరత్‌ను వివరణ కోరగా అప్రోచ్‌రోడ్డు పనులు కూడా కొనసాగుతున్నాయి. పనులను వేగవంతం చేశాం. త్వరలో పనులు పూర్తి చేయించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు.

మినీ స్టేడియాల నిర్మాణమెప్పుడో..?

- టెండర్ ప్రక్రియ దాటని బెల్లంపల్లి మినీస్టేడియం
- ఖాళీ స్థలంపై కబ్జారాయుళ్ల కన్ను
- అభ్యంతరాలతో ఆగిపోయిన మంచిర్యాల స్టేడియం పనులు
- ప్రారంభమైన చెన్నూర్ స్టేడియం

బెల్లంపల్లి: క్రీడల నిర్వహణ కోసం గత ప్రభుత్వం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికో మినీ స్టేడియం మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా ముందడుగు పడటం లేదు. ప్రభుత్వ అధికారుల పట్టింపులేనితనంతో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో తీరుగా పరిస్థితులు ఉన్నాయి. మినీ స్టేడియం నిర్మాణం జరగక యువకులు, క్రీడాకారులు, విద్యార్థుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. నిర్లిప్తత ఆవరించి క్రీడలపై ఆసక్తిని చూపలేకపోతున్నారు. శారీరక కసరత్తు జరగక చలాకీ తనాన్నీ కోల్పోతున్నారు. ఈ కారణంగా యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించాలనే ప్రభుత్వ సంకల్పానికి అధికార యంత్రాంగం మోకాలొడ్డుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.



బెల్లంపల్లిలో ఖాళీగా ఉన్న మినీ స్టేడియం స్థలం

ఖాళీ స్థలంపై కబ్జాదారుల కన్ను..!

బెల్లంపల్లి నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో బెల్లంపల్లిలో మినీస్టేడియం భూమి పడావుగా ఉంటోంది. ఇప్పటికే ఏళ్లు గడుస్తున్నాయి. భూమి ఖాళీగా ఉంటుండటంతో కొందరు భూబకాసురుల కన్ను అటువైపు మళ్లినట్లు తెలుస్తోంది. వేల ఎకరాల భూమి బుధాకలాన్ సర్వే నంబర్ 170పరిధిలో ఉండగా, ఇప్పటికే అక్రమార్కులు అనేక చోట్ల నకిలీపత్రాలు సృష్టించి కబ్జాకు తెగబడ్డ ఘటనలు ఉన్నాయి. మినీ స్టేడియానికి సంబంధించిన భూమికి సైతం దస్త్రాలు తయారు చేసి, ఆక్రమించుకునేందుకు అవకాశాలు లేకపోలేదని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విలువైన భూమి పరాధీనం కాకుండా ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో మంజూరైన మినీ స్టేడియాల స్థలాలను, స్థితిగతులను ఇటీవలనే స్వయంగా వెళ్లి పరిశీలించాం. బెల్లంపల్లిలో పంచాయతీరాజ్ ఏఈతో మాట్లాడి టెండర్ పనులు సత్వరంగా పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరాను. ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించి అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. మంచిర్యాలలో ఏర్పడిన వివాదం త్వరలోనే పరిష్కారం అవుతుంది. మినీ స్టేడియాల నిర్మాణాలను పూర్తి చేయించి క్రీడల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం.

- కీర్తి రాజ్‌వీరు, డీవైఎస్‌వో, మంచిర్యాల

జిల్లాలో స్టేడియాల పరిస్థితి..

జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటి పరిధిలో ఒక్కో మినీ స్టేడియం మంజూరైంది. కొన్నేళ్ల క్రితం స్టేడియాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినా పురోగతి లేకుండా ఉంది. ఇప్పటి వరకు చెన్నూర్‌లో మాత్రమే స్టేడియం నిర్మాణ పనులు పూర్తికాగా, బెల్లంపల్లిలో టెండర్ ప్రాసెస్ దశలో కూనారిల్లుతోంది. మంచిర్యాలలో పనులు ప్రారంభించాక కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లడంతో బ్రేక్ పడి అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. బెల్లంపల్లిలో బుధాకలాన్ శివారు సర్వేనంబర్ 170లో ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇందిరమ్మకాలనీ ప్రాంతంలో కేటాయించారు. మంచిర్యాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడామైదానం భూమిని, చెన్నూర్ కేంద్రంగా 5ఎకరాల చొప్పున భూ కేటాయింపులు జరిగాయి.



మంచిర్యాల స్టేడియంలో బాస్కెట్‌బాల్ ఆడుతూ..

ఒక్కో స్టేడియానికి రూ.2.65 కోట్లు

క్రీడలు, క్రీడాకారుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మినీ స్టేడియాల నిర్మాణానికి సిద్ధమైంది. నిర్లక్ష్యానికి తావులేకుండా భూ కేటాయింపులు చేయడంతోపాటు అంతే సత్వరంగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో మినీస్టేడియం నిర్మాణానికి రూ.2.65కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తూ చిత్తశుద్ధిని ప్రదర్శించింది. కానీ 'అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్న' చందంగా తయారైంది మినీ స్టేడియాల పరిస్థితి. బెల్లంపల్లిలో అన్ని రకాల సానుకూల పరిస్థితులు ఉన్నా, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందు పడలేదనే విమర్శలు ఉన్నాయి. అదే తీరుగా ప్రజాప్రతినిధుల నిర్లిప్తత తోడై టెండర్ దశలో ఆపసోపాలు పడుతోంది. మంచిర్యాల మినీ స్టేడియం నిర్మాణంపై వ్యక్తమైన అభ్యంతరాలను చేధిస్తూ ఏకాభిప్రాయానికి తీసుకురావడానికి తాజాగా యత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆ సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

కత్తెర్లకు బీటీ రోడ్డు మంజూరు



రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఈ శంకర్

తాండూర్: మండలంలో దశాబ్దాల నుంచి రోడ్డు మార్గం నోచుకోని కత్తెర్ల గిరిజన గ్రామానికి ఎట్టకేలకు రోడ్డు సౌకర్యం రాబోతోంది. నేషనల్ హైవే నుంచి కత్తెర్ల గ్రామం వరకు బీటీ రోడ్డును నిర్మించడానికి రూ.1.60లక్షలు మంజూరయ్యాయి. అదే తీరుగా బోయపల్లి నుంచి బుగ్గకు వెళ్లడానికి బీటీ రోడ్డుకు రూ.2.60లక్షలు మంజూరైనట్లు ఐటీడీఏ ఎస్ఈ ఎం.శంకర్ తెలిపారు. స్థానికులతో కలిసి ఎస్ఈ ఆయా రోడ్లను ఆదివారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను ఎత్తివేసిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఎస్ఈ వెంట డీఈ షఫీ, ఏఈ సాయికృష్ణ, కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన పరమేశ్ కొంత కాలంగా డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం పరమేశ్ ఇంటికి వెళ్లి రూ.5వేల నగదు, 50కేజీల బియ్యం, 5కేజీల నూనె అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అజీమొద్దీన్, సభ్యులు ప్రభుదేవ్, సంజీవ్, రాజ్‌కుమార్, చరణ్, నాగరాజు ఉన్నారు.

గుండెపోటుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేశ్ ఎల్ రాథోడ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు కట్టపై ఆదివారం రాముని చెరువు వాకర్ అసోసియేషన్ సభ్యులకు టచ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కార్డియాలజిస్టు డాక్టర్ రమేశ్ ఎల్ రాథోడ్ గుండెపోటుపై అవగాహన కల్పించారు. గుండెపోటు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్, జాగింగ్ చేయాలని, మద్యం, దూమపానానికి దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ, మూడు నుంచి ఆరు నెలలకు ఒకసారి పూర్తి బాడీ చెకప్ చేయించుకోవాలన్నారు. అనంతరం 230మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వికాస్, టచ్ ఆసుపత్రి డైరెక్టర్లు ఎం.సంపత్‌రావు, సుభాష్ చంద్రరెడ్డి, రావికంటి వెంకటేశ్ గుప్త, వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సురభి రవికుమార్, రమేశ్ రావు, ఉపాధ్యక్షులు తాలిబ్‌ఖాన్, బూర్ల జ్ఞాని, జి.ప్రభాకర్‌రావు, జి.సత్యనారాయణ మూర్తి, ఎస్టీ రావు, వేముల వీరస్వామి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: వరి ధాన్యాన్ని ఏమాత్రం జాప్యం చేయకుండా వెంటనే కొనుగోళ్లను పూర్తి చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం గడిచిన 25రోజుల నుంచి రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో ఆలస్యం చేయకుండా కొనుగోళ్లను పూర్తి చేయాలని, దొడ్డురకం వడ్లకు రూ.500బోనసును వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల కోసం సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.అశోక్, నాయకులు శ్రీనివాస్, కిష్టయ్య, దేవదాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కోసం నిరంతరం కృషి



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి

చెన్నూర్: నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ల కోసం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నిరంతరం కృషి చేస్తున్నారని మాజీ జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు తిరుగుతూ వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. అక్రమ దందాలు చేసే శ్రీనివాస్ రైతుల గురించి మాట్లాడడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 9వేల టన్నుల ధాన్యం రైస్ మిల్లర్లకు పంపించినట్లు తెలిపారు. వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు పోగుల సతీశ్, అయిత హిమవంతరెడ్డి, గొడిసెల బాపురెడ్డి, చెన్నూరి శ్రీధర్, సుశీల్‌కుమార్, అంకాగౌడ్, చింతల శ్రీనివాస్, చెన్న వెంకటేశ్, కొంపల్లి బానేశ్, పెండ్యాల శ్రీకాంత్, చెన్నూరి రాజేశ్, అన్వర్, గడ్డం సుమంత్ పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2013–2014 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఒక్కచోట కలిశారు. ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు టీ.రమేశ్ బాబు, విజయ్, చంద్రశేఖర్, ఓంప్రకాశ్, వెంకటరమణలను విద్యార్థులు శాలువాలు కప్పి సన్మానించారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మడేలయ్య బోనాలు



బోనాలతో మహిళలు

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ్య బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో బోనాలు వండుకుని, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మడేలయ్యస్వామికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు.

బీరప్ప కామరాతి కల్యాణం



పూజలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ, వేణు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి గొల్లవాడలో గల బీరప్ప ఆలయం వద్ద బీరప్ప కామరాతిల కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గొల్లకుర్మ కులస్తులు, బీరన్న ఆలయం పూజారులు అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు 110బోనాలను సమర్పించారు. పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు దేవతలకు పూజలు నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని రామాలయం చౌరస్తాలో గల అభయాంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛనల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు హోమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం చేపట్టారు.

భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?



దండేపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 2కు పక్కా భవనం లేకపోవడంతో ఏడాది క్రితం డీఎంఎఫ్‌టీ నుంచి రూ.20లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి ఏడాది దాటినా పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో ఆరు నెలలుగా పనులు నిపివేశారు. నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో, అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాలలో అరకొర వసతుల నడుమ నిర్వహిస్తున్నారు. ఈ విషయం పై పీఆర్ ఏఈఈ సుబ్బారెడ్డిని సంప్రదించగా నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ స్పందించడం లేదు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం అన్నారు.

క్యాంపు కార్యాలయం ముస్తాబు

- సుముహూర్తం కోసం నిరీక్షణ
- ఆగస్టులో ప్రవేశం ఉంటుందని ప్రకటించిన ఎమ్మెల్యే వినోద్



ముస్తాబైన క్యాంపు కార్యాలయం భవనం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆగస్టులో ప్రజలకు అందుబాటులోకి రానుంది. పదేళ్ల క్రితం నిర్మించిన క్యాంపు కార్యాలయానికి ఇటీవల రూ.9లక్షల అంచనాతో మరమ్మతు పనులు జరిగాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచనలకు అనుగుణంగా ఆర్‌అండ్‌బీ అధికారులు కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం శుభదినాలు లేకపోవడంతో వేద పండితుడు చెప్పిన ముహూర్తం ప్రకారంగా ఆగస్టు నెలలో క్యాంపు కార్యాలయంలో గృహ ప్రవేశం చేస్తానని వెల్లడించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జిల్లాలోని చెన్నూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కె.ప్రేమ్‌సాగర్‌రావులు పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందస్తుగానే ఓ ముహూర్తం చూసుకుని ప్రత్యేక పూజలు చేసి క్యాంపు కార్యాలయాల్లో గృహ ప్రవేశం చేయగా మరమ్మతులు చేపట్టిన కారణంగా బెల్లంపల్లిలో ఆ అవకాశం లేకుండాపోయింది. ఏఎంసీ ఏరియాలో ఉన్న సింగరేణి కంపెనీ క్వార్టర్స్‌లో నివాసం ఉండటానికి ఎమ్మెల్యే వినోద్ ఆ క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయిస్తున్నారు. ఆ క్వార్టర్స్ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. క్యాంపు కార్యాలయం, నివాస క్వార్టర్స్‌లో ఒకే ముహూర్తంలో అడుగు పెట్టాలనే తలంపులో ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అవసరాల రిత్యా ఎమ్మెల్యేను కలిసి సమస్యలు చెప్పుకోవడానికి మరో మూడు నెలల పాటు యాతనపడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

'నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో విఫలం'



మాట్లాడుతున్న మోతే రాజలింగు

పాతమంచిర్యాల: పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో, పేదలు మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరల నియంత్రణకు ధరల పర్యవేక్షణ కమిటీలు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. పన్నుల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న ప్రభుత్వాలు, నిత్యావసర ధరలు నియంత్రణ చేయకపోవడం బాధాకరమన్నారు. పెరుగుతున్న ధరలను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథా..!



చెన్నూర్ పాత యూనియన్ బ్యాంక్ ఎదుట వృథాగా పోతున్న భగీరథ నీరు

చెన్నూర్: పట్టణంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు బేజారవుతున్న వృథాగా పోతున్న నీటిని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో మహాంకాళివాడ, కుమ్మరిబొగుడ, గెర్రె కాలనీలో భగీరథ నీరు రాక ఒక పక్క ప్రజలు తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. మరో పక్క మిషన్ భగీరథ పైపులు లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పాత యూనియన్ బ్యాంక్ ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథా పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకేజీలను అరికట్టి ప్రజలకు సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.